



స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో కౌంటింగ్ ఏర్పాట్లులో నిమగ్నమైన అధికారులు


ఈసారైనా కరుణించేనా..?

- నిధుల కొరతతో ముందుకు సాగని ప్రధాన సాగునీటి ప్రాజెక్టులు
- గత బడ్జెట్‌లో కేటాయింపులు జరిగినా ఆ మేరకు విడుదల కాని నిధులు
- కొత్త పథకాలు, ప్రాజెక్టులపై సిక్కోలు ప్రజల ఎదురుచూపులు
- నేడు అసెంబ్లీలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న ప్రభుత్వం

రాష్ట్ర ప్రభుత్వం గురువారం అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌పై జిల్లా ప్రజలు గంపెడాశలు పెట్టుకున్నారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమానికి తప్ప అభివృద్ధికి నిధులు కేటాయించలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా వంశధార, ఆఫ్‌షోర్, మడ్డువలస వంటి ప్రధాన సాగునీటి ప్రాజెక్టులు నిధుల కొరత వెంటాడుతోంది. ప్రతి బడ్జెట్‌లో అరకొర నిధులు కేటాయింపు వాటినీ పూర్తిస్థాయిలో విడుదల చేయకపోవడంతో ప్రాజెక్టులు ముందుకు సాగడం లేదు. ట్రిపుల్ ఐటి, బి.ఆర్ అంబేద్కర్ యూనివర్శిటీలకూ నిధుల సమస్య ఉంది. మరో ఏడాదిలో ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ప్రభుత్వం కొత్తగా ఇచ్చే హామీలు, జిల్లాకు ప్రకటించనున్న అభివృద్ధి ప్రాజెక్టులపై సిక్కోలువాసులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు నిధుల కోసం ఎదురుచూస్తున్నాయి. వంశధార ప్రాజెక్టు ఫేజ్-2, స్టేజ్-2కు అంచనా వ్యయంగా రూ.2671.52 కోట్లు కాగా, ఇప్పటివరకు రూ.1900 కోట్లు వరకు ఖర్చు చేశారు. మరో రూ.200 కోట్లు ఇస్తే ప్రాజెక్టు పనులు పూర్తవుతాయని అధికారులు చెప్తున్నారు. హిరమండలం రిజర్వాయర్, 87 ప్యాకేజీల పనులు 86 శాతం, 88 ప్యాకేజీ పనులు 94 శాతం పూర్తయ్యాయి. హిరమండలం రిజర్వాయర్ పనులు 91 శాతం పూర్తయ్యాయి. వంశధార, నాగావళి నదుల అనుసంధానం పనులను రూ.85 కోట్లతో ప్రారంభించగా, ఇప్పటివరకు రూ.55 కోట్ల వ్యయం చేశారు. అనుసంధానానికి మరో రూ.30 కోట్లు కేటాయించాల్సి ఉంది. ఆఫ్‌షోర్ రిజర్వాయర్ ప్రాజెక్టు అంచనా వ్యయం తాజాగా రూ.852 కోట్లకు పెరిగింది. ఇప్పటివరకు రూ.314.16 కోట్లను ఖర్చు చేశారు. ప్రాజెక్టులు ముందుకు సాగాలంటే, ఆ మేరకు నిధులు కావాల్సిన నేపథ్యంలో ప్రభుత్వం ఎంత మేరకు నిధులు విడుదల చేస్తుందో చూడాల్సి ఉంది.



కేటాయింపులు... కోతలు

గతేడాది బడ్జెట్‌లో వంశధార స్టేజ్-2, ఫేజ్-2కు 2022-23 బడ్జెట్‌లో రూ.103.83 కోట్లను కేటాయించినా రూ.24.23 కోట్లను మాత్రమే విడుదల చేసింది. వంశధార-1 ప్రాజెక్టుకు గత బడ్జెట్‌లో రూ.6.01 కోట్లు మాత్రమే కేటాయించగా రూ.0.40 కోట్లను విడుదల చేసింది. ఆఫ్‌షోర్‌కు గత బడ్జెట్‌లో 50.25 కోట్లు కేటాయించారు. గత బడ్జెట్‌లో రూపాయి కూడా ఇవ్వలేదు.

సాగునీటి ప్రాజెక్టులకు ప్రతిపాదనలు ఇలా...

వంశధార స్టేజ్-2 ఫేజ్-2 పనులకు 476.54 కోట్లు అవసరమని అధికారులు ప్రతిపాదనలు పంపారు. వంశధార-1 ప్రాజెక్టు నిర్వహణ పనులకు రూ.56.56 కోట్లు కావాలని అడిగారు. మడ్డువలస రెండో దశ పనులకు రూ.26 కోట్ల ప్రతిపాదనలు పంపారు.

'నేరడి'కి నిధుల కేటాయింపు జరిగేనా?

నేరడి బ్యారేజీకి నిర్మాణంపై దృష్టిసారించిన ప్రభుత్వం వంశధార జల వివాదాల పరిష్కారానికి ఒడిశా సిఎం నవీన్ పట్నాయక్‌తో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ముఖాముఖి చర్చలు జరిపారు. ఆ తర్వాత ఇటీవల కాలంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు వర్చువల్‌గా సమావేశమయ్యారు. నేరడి ప్రాజెక్టుకు భూసేకరణ, ఒడిశాలో సేకరించనున్న 106 ఎకరాలకు పరిహారం కోసం వంశధార ప్రాజెక్టు అధికారులు ఇప్పటికే రూ.60 కోట్ల అంచనాతో ప్రతిపాదనలను పంపారు. రాబోయే ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఎంతమేర నిధులు కేటాయిస్తారని అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

ట్రిపుల్ ఐటిని వెంటాడున్న మౌలిక వసతులు

ఎచ్చెర్లలోని ట్రిపుల్ ఐటికి సొంత గూడు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఆరు వేల మంది విద్యార్థుల వసతికి అవసరమైన భవనాలు, మౌలిక వసతుల కల్పనకు రూ.600 కోట్లు కావాల్సి ఉంది. మిత్ర ఇంజినీరింగ్, శివానీ ఇంజినీరింగ్ కళాశాలలకు చెందిన భవనాలను నెలకు రూ.ఆరు లక్షల వంతున అద్దెకు తీసుకుని తరగతులు నిర్వహిస్తున్నారు. 2020-21 బడ్జెట్‌లో ట్రిపుల్ ఐటికి రూ.147.27 కోట్లు కేటాయించిన ప్రభుత్వం రెండేళ్లుగా నిధులు కేటాయించలేదు. ఈ ఏడాది బడ్జెట్‌లోనైనా అవసరాల మేరకు నిధులు కేటాయించాలని అంతా కోరుతున్నారు

'భావనపాడు'కు ఏమేర నిధులు కేటాయిస్తారో?

భావనపాడు పోర్టు పనులను ఈ ఏడాదిలోనే ప్రారంభించాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్నట్లు కనిపిస్తోంది. 2022-23 బడ్జెట్‌లో రూ.వంద కోట్లను కేటాయించింది. ఈసారి ఎంతమేర నిధులు కేటాయించనుందో చూడాల్సి ఉంది.

నేడే పట్టభద్రుల ఎమ్మెల్సీ తీర్పు

- మండలి ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధం
- ఇనీషియల్ కౌంటింగ్‌కు 8 గంటలు
- తొలి ఫలితానికి ఒక రోజు సమయం
- 28 టేబుళ్లపై లెక్కింపు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ స్థానానికి సంబంధించి తీర్పు వెలువడే సమయం వచ్చేసింది. ఈ నెల 13న జరిగిన పోలింగ్ ఫలితాల కోసం కౌంటింగ్ గురువారం ప్రారంభం కానుంది. ఓటరు తీర్పు ఎలా ఉంటుందన్న ఉత్కంఠ ఉత్తరాంధ్ర అంతటా నెలకొంది. విశాఖలోని స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో ఏర్పాట్లన్నింటినీ విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్ చూస్తున్నారు. ఈ ఎమ్మెల్సీ ఎన్నికకు 2 లక్షలా 926 ఓట్లు పోలయ్యాయి. వీటి లెక్కింపునకు 28 టేబుళ్లను స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేశారు. ఒక రౌండ్‌కి 1000 ఓట్ల ఫలితాన్ని సిబ్బంది లెక్కిస్తారు. ప్రారంభ కౌంటింగ్ అయ్యేసరికి 8 గంటల సమయం పడుతుంది. తొలి ఫలితంతో దాదాపు ఒక అంచనాకు రావొచ్చు. పూర్తిగా ఫలితం రాబట్టేందుకు ఒక రోజు వ్యవధి పడుతుందని అధికారులు చెబుతున్నారు.

విజేత నిర్ణయం ఎలా ?

పోలైన ఓట్లలో సగం కంటే ఒక్క ఓటు అధికంగా ఒక అభ్యర్థికి వస్తే వారిని విజేతగా రిటర్నింగ్ అధికారి ప్రకటించవచ్చు. 8 రౌండ్ల ఇనీషియల్ కౌంటింగ్ తర్వాత ఆపై ఎన్ని రౌండ్లు ఎలిమినేషన్ ఉంటుందో చెప్పలేని పరిస్థితి. 37 మంది అభ్యర్థులు ఉత్తరాంధ్ర శాసన మండలి పట్టభద్రుల నియోజకవర్గం నుంచి బరిలో ఉండగా ప్రధాన పోటీ పిడిఎఫ్, వైసిపి, టిడిపి మధ్య ఉంటుందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. నాలుగో స్థానంలో బిజెపి ఉంటుంది. రౌండ్ల వారీగా ఎన్ని ఓట్లు ఏ అభ్యర్థికి వస్తాయన్నదానిపైనా విజయం ఆధారపడి ఉంటుంది. ప్రాధాన్యతా క్రమంలో ఓటరు అభ్యర్థికి ఓటు వేసే అవకాశం ఉండడంతో ఆ ఓట్ల లెక్కింపు వల్ల సమయం ఎక్కువ పడుతుంది. ఈ ప్రాధాన్యతా క్రమంలో చివర ఉన్న అభ్యర్థులు ఎలిమినేషన్ అవుతూ ఉంటారు. రెండో ప్రాధాన్యతా ఓటుపైనే విజయం ఈ ఎన్నికల్లో ఆధారపడి ఉంటుందన్నది పలువురి నోట వినిపిస్తోంది. ఉత్తరాంధ్రలో జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తొలి ప్రాధాన్యతా ఓటుతో గెలుపొందిన వారెవరూ 2007 నుంచి ఇప్పటివరకూ లేరు. ఈ దఫా కూడా ఇదే ఫార్ములా ఉంటుందన్నది భావిస్తున్నారు. అందుకే రెండో ప్రాధాన్యత ఓటు కీలకం కానుంది.

పిడిఎఫ్ గెలుపుపై అంచనా

శాసన మండలి ఎన్నికల ఫలితాలు, విజయావకాశాలపై ఇప్పటికే ఉత్తరాంధ్ర అంతటా చర్చోపచర్చలు జోరుగానే సాగుతున్నాయి. ప్రచారంలో 250 ప్రజా సంఘాలు బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ ముందున్నారు. ఈ నేపథ్యంలో ఇంటెలిజెన్స్ వర్గాలు, సిబ్బంది నివేదికలు, ఓటర్ల మాటలను పరిశీలిస్తే రమాప్రభ ప్రభంజనమే సర్వత్రా ఉంటుందని పలువురు చెబుతున్నారు.

టీచర్లు, ఉద్యోగులు, నిరుద్యోగుల విషయంలో రాష్ట్రంలోని అధికార వైసిపి సర్కారు నిర్బంధ వైఖరితో ఉంది. ఈ క్రమంలో ప్రభుత్వ వ్యతిరేక ఓటు పడిందన్నది పై నివేదికల సారాంశం. తెలుగుదేశం, బిజెపిలకు వారివారి పార్టీలకు చెందినవారి ఓట్లు పడినప్పటికీ పిడిఎఫ్‌కు వారు రెండో ప్రాధాన్యత ఓటు వేసినట్టు తెలుస్తోంది.

నేడు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు

- ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభం
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు గురువారం చేపట్టనున్నారు. కౌంటింగ్ ప్రక్రియ ఉదయం ఎనిమిది గంటలకు మొదలుకానుంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. శ్రీకాకుళం నగరంలోని స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. కౌంటింగ్ కోసం నాలుగు టేబుళ్లను ఏర్పాటు చేశారు. కౌంటింగ్ కోసం రిజర్వు సిబ్బందితో కలిపి మొత్తం 35 మందిని సిబ్బందిని నియమించారు.

జిల్లాలో ఈనెల 13న స్థానిక సంస్థల ఎన్నిక జరిగిన విషయం తెలిసిందే. జిల్లాలో మొత్తం 776 మంది ఓటర్లు ఉండగా 752 మంది తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. మొత్తం 96.91 శాతం పోలింగ్ నమోదైంది. పురుష ఓటర్లు 310 మంది ఉండగా 303 మంది ఓటు వేశారు. మహిళల్లో 466 మంది ఓటర్లకు గానూ 449 మంది ఓటేశారు. టెక్కలి డివిజన్‌లో అత్యధికంగా 99.38 శాతం పోలింగ్ శాతం నమోదైంది.

ఇరువురిలోనూ ఉత్కంఠ

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఇద్దరు అభ్యర్థులు పోటీ చేశారు. వైసిపి తరుపున నర్తు రామారావు పోటీ చేశారు. పంచాయతీరాజ్, తూర్పుకాపు సంక్షేమ సంఘం మద్దతుతో ఆనెపు రామకృష్ణ బరిలో దిగారు. మొత్తం 776 ఓట్లలో ఫ్యాన్ గుర్తుపై గెలిచిన వారు 646 మంది ఉన్నారు. వైసిపి తరుపున పోటీ చేసిన నర్తు రామారావు గెలుపునకు ఢోకా లేదని ఆ పార్టీ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వంపై ఉన్న ఆగ్రహం, తూర్పు కాపుల మద్దతు తదితర అంశాలతో క్రాస్ ఓటింగ్ ఏమైనా జరిగిందా అన్న సంశయం వైసిపి వర్గాల్లో వెంటాడుతోంది. స్వతంత్ర అభ్యర్థికి ఒక్క ఓటు పడినా పార్టీపై కొంత ప్రభావం చూపుతుందనే ఆందోళన నెలకొంది. మరోవైపు స్వతంత్ర అభ్యర్థి ఆనెపు రామకృష్ణ గౌరవప్రదమైన ఓట్లు దక్కుతాయని విశ్వసిస్తున్నారు.

కౌంటింగ్‌లో పొరపాట్లకు తావివ్వొద్దు : జెసి

స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి నిర్వహించే కౌంటింగ్ ప్రక్రియలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా సమర్థవంతంగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ కౌంటింగ్ సిబ్బందిని ఆదేశించారు. పాలిటెక్నిక్ కళాశాలలో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన కౌంటింగ్ సిబ్బందికి బుధవారం నిర్వహించిన రెండో విడత శిక్షణా కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం నియమావళిపై రూపొందించిన మాన్యువల్‌ను క్షుణ్ణంగా చదివి అర్థం చేసుకుని పూర్తి అవగాహనను ఏర్పరచుకోవాలని కౌంటింగ్ సిబ్బందికి సూచించారు. కౌంటింగ్‌కు సంబంధించి ప్రతి అభ్యర్థి ఒక కౌంటింగ్ ఏజెంట్‌ని నియమించుకోవచ్చన్నారు. గార తహశీల్దార్, మాస్టర్ ట్రైనీ ఎస్.సుధాసాగర్ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించి మాక్ కౌంటింగ్ చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ బి.శాంతి, డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్, ఎన్నికల కౌంటింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాక్ కౌంటింగ్‌ను నిర్వహిస్తున్న సిబ్బంది



పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

తొలి రోజు పరీక్షకు 924 మంది గైర్హాజరు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లాలోని 109 పరీక్షా కేంద్రాల్లో 26,693 మంది విద్యార్థులు తొలి రోజు పరీక్ష రాయాల్సి ఉండగా, 924 మంది గైర్హాజరయ్యారు. 25,769 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. జనరల్ కేటగిరీలో 24,332 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 23,554 మంది మాత్రమే హాజరయ్యారు. 768 మంది హాజరు కాలేదు. ఒకేషనల్ కేటగిరీలో 2,371 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా వారిలో 156 మంది గైర్హాజరయ్యారు. 2215 మంది హాజరయ్యారు. పరీక్షా సమయానికి నిమిషం ఆలస్యమైనా అనుమతించబోమని నిబంధన నేపథ్యంలో విద్యార్థులు ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. అరగంట ముందే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించారు. పరీక్షలకు జిల్లా యంత్రాంగం పకడ్బందీగా ఏర్పాట్లు చేసింది. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను అమలు చేశారు. మాస్ కాపీయింగ్‌కు తావు లేకుండా చర్యలు చేపట్టింది. సిసి కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలను నిర్వహించారు. మరోవైపు అపార్ట్‌మెంట్లలోని కొన్ని ప్రయివేటు కళాశాలల పరీక్షా కేంద్రాల్లో కొన్ని గదులకు వెలుతురు తక్కువగా ఉంది. జిల్లావ్యాప్తంగా 109 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 109 మంది డిపార్ట్‌మెంట్ అధికారులు, ఐదు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, ఐదు సిట్టింగ్ స్క్వాడ్‌లు పరీక్షలను పర్యవేక్షించారు.

పరీక్షా కేంద్రాలు పరిశీలన

నగరంలోని సాయికృష్ణ, ఆర్‌సిఎం ఇంగ్లీష్ మీడియం జూనియర్ కళాశాలలోని పరీక్షా కేంద్రాలను కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ తీరు, కేంద్రాల్లో ఏర్పాట్లను పరిశీలించారు. చైతన్య, విశ్వవిజేత, శాంతినికేతన్, మహిళా కళాశాలలోని పరీక్షా కేంద్రాలను ఎస్‌పి జి.ఆర్ రాధిక తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద వద్ద 144 సెక్షన్ అమల్లో ఉన్నందున బయట వ్యక్తులు లేకుండా చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. పరీక్షా కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించవద్దని ఆదేశించారు. సిసి కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించాలని స్పష్టం చేశారు. ఆయన వెంట తహశీల్దార్ వెంకటరావు, విద్యాశాఖ అధికారులు ఉన్నారు.

విద్యార్థులతో వినియోగదారుల క్లబ్‌లు

- వినియోగదారుల కోసం 1967 టోల్ ఫ్రీ నంబరు
- పౌరసరఫరాల శాఖ కమిషనర్ అరుణ్ కుమార్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

విద్యార్థులతో వినియోగదారుల క్లబ్‌లను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని పౌరసరఫరాల శాఖ కమిషనర్ హనుమంతు అరుణ్ కుమార్ వెల్లడించారు. ఇందుకోసం ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ, ఐఇసి మెటీరియల్ అందించడం వంటి చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ఇప్పటికే గ్రామీణ, మండల స్థాయిలో ఉన్న క్లబ్‌లను మరింత పటిష్టం చేసి మెరుగ్గా పనిచేసేలా చూస్తున్నట్లు తెలిపారు. ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవ వేడుకలను కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వినియోగదారుడు తమ హక్కులు, బాధ్యతలను గుర్తెరగాలని పిలుపునిచ్చారు. వినియోగదారుడు తాము కొనుగోలు చేసిన వస్తువులకు బిల్లును తప్పనిసరిగా తీసుకోవాలని, అలా చేయకపోవడం వల్ల నష్టపోతున్నారని గుర్తుచేశారు. బిల్లు లేకపోతే వినియోగదారునికి ప్రశ్నించే హక్కు ఉండబోదన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో జరిగే మోసాలను అరికట్టేందుకు సరైన అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత ఉందని తెలిపారు. ప్రతిఒక్కరూ బిల్లు ప్రాధాన్యతను తెలుసుకోవాలన్నారు. వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం 1967 టోల్ ఫ్రీ నంబరును ఏర్పాటు చేసి తగిన సలహాలు, సూచనలు అందించనున్నట్లు తెలిపారు. వినియోగదారుల సమస్య తీవ్రతను బట్టి కొన్ని సందర్భాల్లో సుమోటోగా పరిగణించనున్నట్లు స్పష్టం చేశారు.

మోసాలను అరికట్టేందుకు ప్రతిఒక్కరికీ అవగాహన తప్పనిసరి అని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ తెలిపారు. ప్రతి ఏడాది ఒక నినాదంతో వినియోగదారుల దినోత్సవాలను నిర్వహించుకోవడం పరిపాటి అని, ఈ ఏడాది స్వచ్ఛమైన ఇంధన పరివర్తన ద్వారా వినియోగదారులకు సాధికారత కల్పించనున్నట్లు చెప్పారు. ఇందుకు ఇపిడిసిఎల్, నెడ్‌క్యాప్ సంస్థలు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇంధన పరివర్తనలో జిల్లా యంత్రాంగం ఇప్పటికే చర్యలు చేపట్టిందన్నారు. ప్రతి గ్రామ, వార్డు సచివాలయాలకు సోలార్ విద్యుత్‌ను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. మొదటి దశగా 400 గ్రామ సచివాలయాలకు గానూ 50 సచివాలయాల్లో సోలార్ విద్యుత్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో వినియోగదారుల ఫోరం జిల్లా అధ్యక్షులు రఘుపాత్రుని చిరంజీవి, ఫోరం సభ్యులు బగాది రామ్మోహన్‌రావు, జి.రాధారాణి, షణ్ముఖరావు, జిల్లా పౌరసరఫరాల అధికారి డి.వి రమణ, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ పి.జయంతి, డిఆర్‌డిఎ పీడీ డి.వి విద్యాసాగర్, డిఇఒ జి.పగడాలమ్మ, డిఎంహెచ్‌ఒ బి.మీనాక్షి, సెట్‌శ్రీ సిఇఒ బి.వి ప్రసాదరావు, ఇతర శాఖల అధికారులు, ఫోరం సభ్యులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పౌరసరఫరాల శాఖ కమిషనర్ అరుణ్ కుమార్

ఆప్కో ప్రత్యేక క్లియర్ సేల్

శ్రీకాకుళం అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థ ఆప్కో ఎంపిక చేసిన చేనేత వస్త్రాలపై ప్రత్యేక తగ్గింపు ధరకు క్లియర్ సేల్‌ను ప్రారంభించినట్లు ఆప్కో డివిజనల్ మార్కెటింగ్ అధికారి పి.సోమేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఒకటి కొంటే ఒకటి ఉచితం, ఒకటి కొంటే రెండు ఉచితం, ప్రత్యేక తగ్గింపు ధరలను అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. క్లియర్ సేల్స్ కౌంటర్‌ను నగరంలోని అంబేద్కర్ కూడలి వద్ద గల నేతబజార్ షాపింగ్ కాంప్లెక్స్‌లో ప్రారంభించినట్లు తెలిపారు. రాష్ట్రంలో పేరెన్నికగన్న ధర్మవరం, మాధవరం, వెంకటగిరి, ఉప్పాడ జరీ చీరలు... బందరు, మంగళగిరి, రాజమండ్రి ప్రింటెడ్ కాటన్ డ్రెస్ మెటీరియల్స్, ప్రింటెడ్ బెడ్‌షీట్స్, దుప్పట్లు, దోమతెరలు, లుంగీలు, టవల్స్ తదితర చేనేత వస్త్రాలు విక్రయిస్తున్నట్లు పేర్కొన్నారు.



ఆస్కార్ అవార్డు పొందిన ఆర్‌ఆర్‌ఆర్ సినిమాలోని నాటు నాటు పాటకు, ది ఎలిఫెంట్ విస్పర్స్ డాక్యుమెంటరీకి అభినందనలు తెలుపుతూ ఆమదాలవలస మండలంలోని గాజులకొల్లివలసకు చెందిన సైకత శిల్పి గేదెల హరికృష్ణ సైకత శిల్పాన్ని రూపొందించారు.

- ప్రజాశక్తి, ఆమదాలవలస

క్రీడలకు ప్రాధాన్యత

శ్రీకాకుళం అర్బన్ : క్రీడలు చదువులో అంతర్భాగమని, క్రీడా రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. నగరంలోని కోడి రామ్మూర్తి స్టేడియం ఆవరణలో నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యాన నిర్వహించిన జిల్లాస్థాయి క్రీడా పోటీలను డిఎస్‌పి ఎం.మహేంద్రతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత క్రీడలపై ఆసక్తి పెంచుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. క్రీడల్లో జిల్లాకు అంతర్జాతీయ చరిత్ర ఉందని గుర్తు చేశారు. క్రీడాకారులకు తగిన గుర్తింపు, గౌరవం ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. ఇటీవల నిర్వహించిన ఉద్యోగ నియామకాల్లో స్పోర్ట్స్ కోటా వర్తింపజేశారని గుర్తుచేశారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలోఎన్‌వైకె కోఆర్డినేటర్ కె.వి ఉజ్వల్, పర్యాటక శాఖ అధికారి ఎన్.నారాయణరావు, సెట్‌శ్రీ సిఇఒ ప్రసాదరావు, చీఫ్ కోచ్ ఎం.మాధురీలత, మెప్మా పీడీ ఎం.కిరణ్ కుమార్, స్టార్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు ఎస్.జోగినాయుడు తదితరులు పాల్గొన్నారు.



బహుమతులను అందజేస్తున్న జెసి నవీన్

తీర ప్రాంతాల్లో వాచ్ టవర్లు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

తీర ప్రాంతాల్లో వాచ్ టవర్లను ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ తెలిపారు. జిల్లాస్థాయి తీర ప్రాంత భద్రతా కమిటీ సమావేశాన్ని కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని మంచినీళ్లపేట, రాజారాంపురం, మొగదలపాడు, పిజిపేట, కుందువానిపేట, బారువ, కొత్తఊరు తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్న వాచ్ టవర్లకు స్థల విషయమై సంబంధిత తహశీల్దార్లకు ఆదేశాలు జారీ చేస్తామన్నారు. ప్రమాద స్థలాల వద్ద హెచ్చరిక బోర్డుల ఏర్పాటుకు జిల్లా నిధుల నుంచి మంజూరు చేస్తామని హామీనిచ్చారు. సముద్రతీర ప్రాంతాల్లో ప్రమాదాలు సంభవించే ప్రదేశాల వద్ద ఈతగాళ్లను ఏర్పాటు చేయాలని సభ్యులు కోరగా, మత్స్యశాఖలో ఈతగాళ్లు ఉంటారని, వారితో సమన్వయం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. మత్స్యశాఖ జారీ చేసే బయోమెట్రిక్ కార్డులు, ఆధార్ కార్డులను సముద్రంలో వేటకు వెళ్లే మత్స్యకారులు తీసుకెళ్లకపోతే సాధారణ రుసుము వసూలు చేయాలన్నారు. తద్వారా కార్డులపై వారిలో అవగాహన కలుగుతుందన్నారు. మత్స్యశాఖ గుర్తింపు పొందని బోట్లు 11 మండలాల్లో 43 ఉన్నాయని, వాటిని రిజిస్ట్రేషన్ చేసుకుంటే నంబరును కేటాయిస్తామని మత్స్యకారులకు తెలియజేసినట్లు మత్స్యశాఖ ఉప సంచాలకులు పి.వి శ్రీనివాసరావు కలెక్టర్‌కు వివరించారు. అలర్ట్ ట్రాన్స్‌మీటర్స్ మత్స్యకారుల వద్ద లేనందున ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని తెలియజేయగా, వాటిపై తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మత్స్యకారులకు బయోమెట్రిక్ కార్డులు, కలర్ కోడ్‌పై అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఎస్‌పి జి.ఆర్ రాధిక, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ పి.రాము, కస్టమ్స్ ప్రివెంటివ్ యూనిట్ సూపరింటెండెంట్ ప్రవీణ్ కుమార్, ఇండియన్ కోస్ట్‌గార్డు అధికారి ఎస్.ఎం బాషా, కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ ఎఎస్‌పి జి.బి.ఆర్ మధుసూదనరావు, మెరైన్ డిఎస్‌పి ఆర్.గోవిందరావు, ఐబి జెడిడి కె.గణేషన్, డిసిఐఒ పి.కె.మహాపాత్రో, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

విద్యాశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలి

ఎన్నికల సంఘానికి యుటిఎఫ్ ఫిర్యాదు

శ్రీకాకుళం : ఈనెల 13వ తేదీన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకునేందుకు స్పెషల్ క్యాజువల్ లీవ్ వినియోగించుకోవాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఇచ్చిన ఉత్తర్వులు అర్థం చేసుకోవడంలో, అమలు చేయడంలో జిల్లా విద్యాశాఖ అధికారి జి.పగడాలమ్మ విఫలమయ్యారని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చౌదరి రవీంద్ర, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.అప్పారావు, ఎస్.కిషోర్ కుమార్ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. జలుమూరు, నరసన్నపేట, ఎల్.ఎన్ పేట, పోలాకి, కొత్తూరు తదితర మండలాల విద్యాశాఖ అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించి ఎన్నికల సంఘం ఉత్తర్వులను అమలు చేయకుండా, ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురిచేశారని తెలిపారు. జలుమూరు ఎంఇఒ యాప్‌లో నమోదు చేసిన స్పెషల్ క్యాజువల్ లీవ్‌ని రద్దు చేసి మరీ ఉపాధ్యాయులను ఇబ్బంది పెట్టారని చెప్పారు. విచారణ చేసి వీరిపై తక్షణం చర్యలు తీసుకోవాలని కోరారు.

సక్రమంగా విధులు నిర్వహించాలి

గార : క్షేత్రస్థాయిలో సిబ్బంది తమ విధులను సక్రమంగా నిర్వహించాలని, అప్పుడే ఉపాధి హామీ లక్ష్యాలను నెరవేర్చుకోగలమని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు జి.వి చిట్టిరాజు అన్నారు. మండల కేంద్రంలో ఉపాధి హామీ కార్యాలయాన్ని బుధవారం సందర్శించిన ఆయన అక్కడ సిబ్బంది పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్‌కార్డులోని సమాచారం ఆధార్ కార్డులోని సమాచారం ఒకే విధంగా ఉండాలని, అలా లేకుంటే కూలీలకు వేతనాలు వారి ఖాతాల్లో జమ కావన్నారు. అటువంటి తప్పులను గుర్తించి యుద్ధప్రాతిపదికన సరిచేయాలని సిబ్బందిని ఆదేశించారు. ప్లాంటేషన్ పనుల్లో భాగంగా చేపట్టిన మొక్కల పెంపకం పనుల్లో నూటికి నూరు శాతం మొక్కలు క్షేత్రస్థాయిలో ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. పోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలను తక్షణం నాటాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎపిఒ సంధ్యారాణి, జెఇ నారంనాయుడు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

అరసవల్లికి రూ.లక్ష విరాళం



చెక్కును అందజేస్తున్న సురేష్‌కుమార్ దంపతులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్
అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయానికి వచ్చే యాత్రికులకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు ఆర్ఒ ప్లాంట్ భవనానికి నగరానికి చెందిన ఎల్.సురేష్ కుమార్, అనురాధ దంపతులు రూ.లక్ష విరాళంగా ఇచ్చారు. ఆలయ ఇఒ వి.హరి సూర్యప్రకాష్‌కు బుధవారం చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, ఆలయ సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వరరావు, జూనియర్ అసిస్టెంట్ బి.ఎస్ చక్రవర్తి హాజరయ్యారు.

కేన్సర్‌పై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్
గ్రామీణ ప్రాంతాల్లో మహిళల్లో కేన్సర్‌పై అవగాహన అవసరమని హెచ్‌సిజి పినాకిల్ ఆస్పత్రి సీనియర్ ఆంకాలజిస్టు డాక్టర్ సి.రవి వెంకటాచలం అన్నారు. నగరంలోని ప్రభుత్వ సర్వజనాసుపత్రిలోని గైనిక్ విభాగంలో బుధవారం ఉచిత కేన్సర్ వైద్య శిబిరం నిర్వహించారు. మహిళలకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కువ మంది గర్భాశయ ముఖద్వారం వద్ద సర్వికల్ కేన్సర్, రొమ్ము కాన్సర్‌కు గురవుతున్నారని తెలిపారు. ప్రభుత్వ సర్వజనాస్పత్రి గైనిక్ విభాగం హెచ్‌ఒడి డి.పార్వతి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ యశ్వంత్, కోటేశ్వరరావు, జయరాజ్, పద్మజ, వనజ, గైనిక్ విభాగం పిజి విద్యార్థులు పాల్గొన్నారు.

బిసి వసతిగృహం పరిశీలన



అధికారులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

ప్రజాశక్తి - టెక్కలి రూరల్
మండలంలోని పోలవరం గ్రామంలోని బిసి బాలుర వసతిగృహాన్ని సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి బుధవారం రాత్రి పరిశీలించారు. ఈ వసతిగృహంలో 35 మంది విద్యార్థులకు అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. ఆరోగ్యం కుదుటపడి, వసతిగృహానికి వచ్చిన 32 మంది విద్యార్థులను ఆయన పరామర్శించారు. ఆరోగ్యం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తల్లిదండ్రులకు సబ్ కలెక్టర్ వివరించారు.

మృతుల కుటుంబాలకు చెక్కు అందజేత



చెక్కును అందజేస్తున్న ఎస్‌పి రాధిక

ప్రజాశక్తి - శ్రీకాకుళం
జిల్లా పోలీసు శాఖలో విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మృతి చెందిన పోలీసుల కుటుంబసభ్యులకు ప్రభుత్వం నుంచి మంజూరైన నగదు చెక్కులను ఎస్‌పి జి.ఆర్ రాధిక జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం అందజేశారు. పోలాకి పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్ వి.మహదేవన్ కుటుంబసభ్యులకు, ఎఆర్ విభాగంలో స్వీపర్‌గా విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మరణించిన కె.అరుణకుమారి కుటుంబసభ్యులకు విడో ఫండ్, ఫ్లాగ్ ఫండ్ రూ.75 వేలు చొప్పున చెక్కులను అందజేశారు. రావాల్సిన మిగిలిన ప్రయోజనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని కార్యాలయ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎఎస్‌పి టి.పి విఠలేశ్వర్ ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

మడ్డువలస కాలువలో పూడికలు తొలగించాలి



కాలువను పరిశీలిస్తున్న అప్పలనాయుడు

ప్రజాశక్తి-లావేరు
మడ్డువలస కాలువలో పూడికలు తొలగించకుండా రైతాంగానికి సాగునీరు సక్రమంగా ఎలా అందిస్తారని టిడిపి ఎచ్చెర్ల నియోజకవర్గ సీనియర్ నాయకులు కలిశెట్టి అప్పలనాయుడు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రైతుల అభ్యర్థన మేరకు ఎల్ఎన్.పురంలో మడ్డువలస కాలువలను, సాగునీటి చెరువులను ఆయన పరిశీలించారు. మొత్తం పూడికలు, తుప్పలతో నిండిపోయి ఉండడాన్ని గమనించారు. ఇలా ఉంటే రైతులకు నీరు ఎలా అందిస్తారని ప్రశ్నించారు. ప్రభుత్వం, అధికారులు తక్షణమే స్పందించి రైతాంగానికి న్యాయం చేయాలని, కాలువల ద్వారా సక్రమంగా నీరు అందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే రైతుల తరపున పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రైతులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఆయన వెంట పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు ఉన్నారు.


పంట నమోదులో సవరణలకు అవకాశం



రైతులకు అవగాహన కల్పిస్తున్న మహేష్

ప్రజాశక్తి - రణస్థలం రూరల్
పంట నమోదులో తప్పులుంటే సవరించుకోవాలని ఉద్యాన సహాయకులు లాభాల మహేష్ రైతులను కోరారు. మండలంలోని బంటుపల్లి గ్రామ రైతు భరోసా కేంద్రం వద్ద 2022 రబీ, పైరు పంట వివరాలు నమోదు, సోషల్ ఆడిట్ నిమిత్తం ప్రదర్శించడం జరిగిందన్నారు. బంటుపల్లి, తిరుపతిపాలెం గ్రామాల రైతుల పంట నమోదు వివరాలు సరిచూసుకుని, అభ్యంతరాలు ఉంటే సరిచేసేందుకు తనని సంప్రదించాలని కోరారు.

ఆలయానికి రూ.25 వేలు విరాళం



విరాళం అందజేస్తున్న తిలక్

టెక్కలి రూరల్: టెక్కలి మేజర్ పంచాయతీ అదిఆంధ్రావీధిలో శ్రీ నీలమణిదుర్గ ఆలయ విగ్రహ ప్రతిష్టకు కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేడాడ తిలక్ రూ.25వేలు విరాళం అందజేశారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపిపి నడుపూరి శ్రీరామ్మూర్తి, బమ్మిడి తులసిరావు, కిల్లి అజయ్, అల్లు మాధవరావు, చిన్ని జోగారావు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నిందితులను అరెస్టు చేయాలి

కొత్తూరు: దళితుల హత్య కేసులో నిందితులను అరెస్టు చేయాలని దళిత మహాసభ అధ్యక్షులు తొంపల తిరుపతిరావు, కన్వీనర్ పడాల నాగభూషణరావు డిమాండు చేశారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. బూర్జ మండలం నీలంపేటకు చెందిన జమ్మన సుదర్శన్, చిలకపాలెంకు చెందిన లింగాల నరేంద్రకుమార్ ఇటీవల హత్యకు గురయ్యారని, ఈ హత్య కేసుల్లో నిందితులపై చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. సమావేశంలో నాయకులు బి.రామకృష్ణ, ఎన్.జగజ్జీవన్‌రావు, బాలకృష్ణ, జి.రామారావు, ఎం.శంకరరావు పాల్గొన్నారు.

విద్యార్థుల ఫిర్యాదులపై విచారణ



విచారణ చేస్తున్న అధికారులు

బూర్జ: మండలంలోని పాలవలస గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో విద్యార్థులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం మరోసారి బాలల అక్రమ రవాణా నివారణ విభాగం ఎస్ఐ కేశవరావు విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులతో మాట్లాడారు. విద్యార్థులు ఇబ్బందులకు గురికాకుండా ఉండాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. కార్యక్రమంలో హెచ్‌సి గోవిందరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'నీట్'గా మెరిశారు



వివేక్



నీలిమ



కిరణ్

ప్రజాశక్తి - మెళియాపుట్టి
నీట్ పీజీ సెట్‌లో అన్నా, చెల్లెళ్లు ప్రభంజనం సష్టించారు. మండలంలోని సుందరాడ గ్రామానికి చెందిన నీవగాన కిరణ్, నీలిమ ఉత్తమ ర్యాంకులు సాధించారు. నీలిమ ఆల్ ఇండియా స్థాయిలో 600 ర్యాంకు సాధించగా, కిరణ్ 8200 ర్యాంకు సాధించారు. వీరిద్దరూ పాతపట్నంలోని ఓ ప్రైవేటు స్కూల్‌లో పదో తరగతి, ఇంటర్ విజయవాడలోని శ్రీ చైతన్యలో చదివారు. ఎంబిబిఎస్ విశాఖలోని ఆంధ్రా మెడికల్ కాలేజీలోచదివారు. తండ్రి పాపారావు కోడూరు పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నారు. వీరిద్దరూ మంచి ర్యాంకులు సాధించడంపై తల్లిదండ్రులతో ఆపటటు, గ్రామస్తులు అభినందించారు.

మెళియాపుట్టికి చెందిన సాయి వివేక్ 319వ ర్యాంకు సాధించాడు. ఈయన గుంటూరులోని ఎన్ఆర్ఐ కళాశాలలోఎంబిఎస్ చేశారు.

విద్యార్థులకు 'పరీక్ష'



ఆటోలో ప్రమాదకర ప్రయాణం చేస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి - బూర్జ
మండలంలోని ఓవిపేట మోడల్ స్కూల్, కొల్లివలస కెజిబివి ఇంటర్ విద్యార్థులకు పరీక్ష తప్పలేదు. బూర్జ ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని పరీక్షా కేంద్రం వీరికి కేటాయించారు. ఓవిపేట నుంచి బూర్జ 18 కిలోమీటర్లు, కొల్లివలస నుంచి బూర్జ 8 కిలోమీటర్లు. ఓవిపేట మోడల్ స్కూల్ విద్యార్థినులు 19 మందిని ఒకే ఆటోలో పరీక్షా కేంద్రానికి కిక్కిరిసి తరలించారు. కెజిబివి విద్యార్థినులు 17 మందిని ఒకే ఆటోలో తరలించడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నిబంధనలు ప్రకారం నలుగురికి మించి ఆటోలో ఎక్కించకూడదు. విద్యార్థుల నుంచి రాను, పోను రూ.60 వసూలు చేశారు. ఆ డబ్బులకు రెండు ఆటోలు పెట్టి వీరిని తరలించి ఉంటే బాగుండేదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. 19 మందిని ఒకే ఆటోలో తరలించిన సమయంలో ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. సమయం లేనందున, ఆటోలు దొరక్కపోవడంతో ఒకే ఆటోలో వారిని తరలించాల్సి వచ్చిందని వార్డెన్ విజయభారతి చెప్పడం విశేషం.

శారీరక దారుఢ్యంతోనే సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్
శారీరక దారుఢ్యంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, ప్రతీ ఒక్కరూ వ్యాయామం చేయడం తప్పనిసరి అని ప్రముఖ వైద్యనిపుణులు దానేటి శ్రీధర్ అన్నారు. నగరంలోని మెడికవర్ ఆసుపత్రిలో బుధవారం రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాడీబిల్డింగ్ ఎంతో ఖర్చుతో కూడుకున్నదని, అటువంటి క్రీడలో రాణిస్తూ ముందుకు సాగుతుండడం అభినందనీయమన్నారు. నేడు మారుతున్న ఆహారపు అలవాట్ల నేపథ్యంలో చిన్నవయసులోనే అనారోగ్యం బారిన పడుతున్నారని, వ్యాయామం చేయడం ద్వారా ఆరోగ్యంగా, ఫిట్ గా ఉంటారని చెప్పారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ బాడీ బిల్డర్స్ అసోసియేషన్ అసోసియేట్ సెక్రటరీ విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఈ నెల 19న 25వ మిస్టర్ ఆంధ్రా రాష్ట్రస్థాయి పోటీలు ఆర్ట్స్ కళాశాల వేదికగా నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ పోటీలకు జిల్లా నుంచి 40 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారని, రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 300 మంది క్రీడాకారులు పోటీలకు వస్తున్నారని వివరించారు. వీరికి వసతి, భోజన సౌకర్యాలు అందించడంతో పాటు విజేతలకు నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.

కార్యక్రమంలో బాడీబిల్డర్లు నవీన్, రఫీ, శేఖర్, మదీనా, మధు అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బి.ప్రసాద్, అసోసియేషన్ సభ్యులు మనోజ్‌కుమార్ మండల, టీమ్ మేనేజర్ కె. గౌరీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

ప్రజాశక్తి - పలాస
మండలంలోని రెంటికోట గ్రామంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రెంటికోట గ్రామానికి చెందిన నందకుడియా లబో(60) అక్కడికక్కడే మృతి చెందాడు. గొప్పిలి నుంచి పలాస వైపు ఆర్టీసీ బస్సు వస్తోంది. లబో రోడ్డు దాటుతుండగా ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ముందు చక్రాలు ముందు పడి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కాశీబుగ్గ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. పలాస ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పొడుగుపాడులో చైన్ స్నాచింగ్

కోటబొమ్మాళి: మండలంలోని పొడుగుపాడుకు చెందిన బెండి అన్నపూర్ణ మెడలోని పుస్తెలతాడును గుర్తుతెలియని వ్యక్తులు చోరికి పాల్పడ్డారు. అన్నపూర్ణ మంగళవారం రాత్రి కోటబొమ్మాళిలో ఓ వివాహ విందుకు హాజరై తిరిగి తన భర్తతోకలిసి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా పొడుగుపాడు సమీపంలో గ్రానైట్ పరిశ్రమ వద్ద గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనాన్ని అపి అమె మెడలో ఉన్న ఒకటిన్నర తులం బంగారు పుస్తెలతాడును తెంచుకొని పారిపోయారు. దీని విలువ రూ.70వేలు ఉంటుంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎస్‌కె.మహ్మద్ అలీ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో దహనం

బూర్జ: మండలంలోని కెకె.రాజపురం గ్రామానికి చెందిన గొర్ల వెంకటరావుకు చెందిన ఆటో మంగళవారం రాత్రి దహనమైంది. గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో ఆటో పూర్తిగా కాలిపోయింది. ఎనిమిదేళ్లుగా ఆటో నడపుతున్నానని, ఇదే తనకు జీవనాధారమని వెంకటరావు వాపోయాడు. రెండు రోజుల క్రితం అర్ధరాత్రి సమయంలో ఇదే ఆటోకు దుండగులు నిప్పు పెట్టారని, దీనిపై పోలీసులకు కూడా ఫిర్యాదు చేశామని చెప్పాడు. రెండో సారి కూడా ఆటోను తగలబెట్టారని పోలీసులకు తెలిపాడు. ఎస్ఐ అశోక్‌బాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అవగాహనే వినియోగదారుని అస్త్రం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆసరా సభ్యులు

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్
కొనుగోలు చేసే ప్రతి వస్తువులో, సేవలో లోపం లేకుండా సరైన ధర, తూకం, నాణ్యత, స్వచ్ఛత కలిగినవి పొందే హక్కు వినియోగదారులకు ఉందని నెహ్రూ యువ కేంద్రం కో-ఆర్డినేటర్ ఉజ్వల్ అన్నారు. నగరంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో బుధవారం ప్రపంచ వినియోగదారుల దినోత్సవ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఆసరా సంస్థ ఆధ్వర్యాన నిర్వహించిన మాట్లాడారు. వినియోగదారుల హక్కులు, 1986 చట్టం నుంచి ప్రయోజనాలు పొందవచ్చన్నారు. నేటి సమాజంలో మోసాలు ఎక్కువై పోయాయని, తాగే పాళ్లు, నీళ్లలో కూడా నాణ్యత లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తూకాల్లో భారీగా తేడాలు ఉంటున్నాయని, వీటిపై ఎవరైనా ప్రశ్నిస్తే, నిలదీస్తే తప్ప న్యాయం జరగడం లేదన్నారు. ఈ తరహా మోసాలను అరికట్టాలంటే వినియోగదారులే మేల్కొనాలన్నారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కొంక్యాన వేణుగోపాల్, నెహ్రూ యువకేంద్రం సమన్వయకర్త ఉజ్వల్‌ను సత్కరించారు. కార్యక్రమంలో ఆసరా జిల్లా అధ్యక్షులు గంజి ఎజ్రా, స్టార్ వాకర్స్ క్లబ్ అధ్యక్షులు జోగినాయుడు, జి.ఇందిరాప్రసాద్, బి.వి రవికుమార్, ఆర్‌సి కూన వెంకటరమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన అవసరం

పర్లాకిమిడి: వినియోగదారులు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని వినియోగదారుల హక్కుల పరిరక్షణ కమిటీ జిల్లా కార్యదర్శి ఆర్.లోకనాథం, జిల్లా కార్యాచరణ అధ్యక్షులు తనూజా సతపతి, గుశానీ సమితి అధ్యక్షులు బి.చలపతిరావు అన్నారు. బుధవారం వినియోగదారుల హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆహార సంరక్షణ, సమాచార హక్కు, ప్రజా సేవల చట్టం, గ్యాస్ సేవల్లో అవకతవకలు, విద్యుత్‌బిల్లులు, స్మార్టు మీటర్లలో అవకతవకలు, ఇతర హక్కులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బాలకృష్ణ, ముచ్చి బంగారు, త్రినాథరావు, లింగరాజు, తదితరులు పాల్గొన్నారు.



గ్రైండర్ వితరణగా అందజేస్తున్న సభ్యులు

పాఠశాలకు గ్రైండర్ వితరణ

ప్రజాశక్తి - పలాస
కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు గ్రీన్ ఆర్మీ, పాఠశాల ఉపాధ్యాయులు నగిరి లక్ష్మి సంయుక్తంగా గ్రైండర్‌ను బుధవారం అందజేశారు. మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా విద్యార్థులకు ఆహార పదార్థాలు చేసేందుకు దీన్ని వినియోగించాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం హరిబాబు, గ్రీన్ ఆర్మీ అధ్యక్షులు బోనేల గోపాల్, జాతీయ అవార్డు గ్రహీత ఆసపాన మధుబాబు, ఇరిగేషన్ అధికారి శ్రీనివాసరావు, సైన్సు ఉపాధ్యాయులు బోకర దుర్యోధన, కొత్తపల్లి చిన్నారి, గ్రీన్ ఆర్మీ కార్యదర్శి బందాపు తిరుమల, అధ్యాపకులు పాల్గొన్నారు.



కాలువ పనులు చేయిస్తున్న గోపి

సొంత నిధులతో కాలువ నిర్మాణం

పలాస: 19వ వార్డు కౌన్సిలరు ప్రతినిధి శిష్ట గోపి తన సొంత నిధులతో కాశీబుగ్గ సూదికొండ పరిధి అంబేద్కర్ నగర్‌కు వెళ్లే రోడ్డుపై కాలువను నిర్మించారు. కాలువ పాడవ్వడంతో మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. ప్రజలు, వాహనదారులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. దీన్ని గుర్తించిన గోపి జెసిబితో కాలువ తవ్వించి, రోడ్డుపై నీరు ప్రవహించకుండా పైపులు వేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు లండ దానేష్, పొన్నాడ చిన్నారావు, చిన్న, కోటేశ్వరరావు, బి.కృష్ణ, కె.ఆది, ఎం.దిలీప్, దాసరి, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాన్ని వినియోగించుకోవాలి



గిరిబాబు, దివ్యను సన్మానిస్తున్న యువివి సభ్యులు

ప్రజాశక్తి - పలాస
గ్రంథాలయం నిరుద్యోగులకు ఎంతగానో దోహదపడుతుందని నెఫ్రాలజిస్ట్ గొరకల గిరిబాబు, ఎంఎస్ ఇఎన్ టి.దివ్య అన్నారు. మండలంలోని నీలావతి గ్రామంలో ఉద్దాన విద్యా అభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గ్రంథాలయాన్ని వారు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చిన్నప్పటి నుండే లక్ష్యాలు ఏర్పర్చుకొని లక్ష్య సాధన కోసం నిరంతరం కృషి చేయాలన్నారు. యువివి చేస్తున్న కార్యక్రమాలకు ప్రశంసిస్తూ ఈ వేదికకు ఎల్లప్పుడు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. దేశ ప్రధాని ఆయుష్మాన్ భారత్ మిషన్ స్ఫూర్తిని తీసుకొని తాము కూడా ఆయుష్మాన్ ఉద్దానం పేరుతో సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తామన్నారు. అనంతరం గిరిబాబు, దివ్య లకు ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో యువివి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి జోగారావు, బొడ్డు చిన్నారావు, ప్రకాష్, కామేష్, సీతారాం, సుధాకర్, వాసు, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ



పేదలకు దుస్తులను పంపిణీ చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - కోటబొమ్మాళి
తన తండ్రి జ్ఞాపకార్థం సదాశివ గంగారావు ఏర్పాటుచేసిన సదాశివ ఫౌండేషన్‌ను కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కె.హరివరప్రసాద్ ప్రారంభించారు. తొలుత సదాశివరావు చిత్రపటానికి పూలమాలేసి, నివాళు లర్పించారు. అనంతరం వికలాంగులు, వృద్ధులకు బుధవారం దుస్తులు, మెమెంటోలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తిలక్ మాట్లాడుతూ సేవా సంస్థ ద్వారా పేదలకు ఆదుకోవడం అభినందనీయమన్నారు. గంగారావు మాట్లాడుతూ తన తండ్రి పేరును నిరంతరం గుర్తిండేందుకు ఈ సంస్థను అన్ని ప్రభుత్వ అనుమతులతో ప్రారంభించానని, దీని ద్వారా పేదలకు అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తానని చెప్పారు. పలు పుణ్యక్షేత్రలలో తన తండ్రి జ్ఞాపకార్థం అన్నదానం నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి దుబ్బ వెంకటరావు, ఎంపిపిలు రోణంకి ఉమామల్లేశ్వరరావు, శ్రీరామ్మూర్తి, వైఎస్ ఎంపిపి దుక్క రోజా రామకృష్ణ, తర్ర రామకృష్ణ, బి.గోవిందరాజులు, నాగయ్యరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



కమ్యూనిటీ భవనాన్ని పరిశీలిస్తున్న సచివాలయ సిబ్బంది

కమ్యూనిటీ భవనాన్ని తొలగించండి

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం
పట్టణంలోని 11వ వార్డు కస్పావీధిలోని శిథిలావస్థలో ఉన్న కమ్యూనిటీ భవనాన్ని తొలగించాలని వార్డు కౌన్సిలరు ఆసి లీలారాణి కోరారు. ఈ భవనం ఎప్పుడు కూలిపోతుందో తెలియదని అన్నారు. 3వ సచివాలయ సెక్రటరీ జీవన్ షేక్ దృష్టికి ఆమె తీసుకురావడంతో వారు శిథిలమైన కమ్యూనిటీ భవనాన్ని బుధవారం పరిశీలించారు. లీలారాణి మాట్లాడుతూ ఈ విషయమై గతంలో మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లానని చెప్పారు. ఈ భవనం వద్ద వృద్ధులు, పిల్లలు ఎక్కువగా ఉంటారని, తక్షణం తొలగించకుంటే పెను ప్రమాదం సంభవిస్తుందని అన్నారు.

ముమ్మరంగా ఆస్తి పన్ను వసూలు



పన్ను చెల్లిస్తున్న ప్రకాష్‌కుమార్ సాహు

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీలో ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మున్సిపల్ అధికారులు ముమ్మరంగా ఆస్తి పన్ను వసూలు చేశారు. బుధవారం ఎస్‌బిఐ బ్యాంకుకు సంబంధించి ప్రకాష్ కుమార్ సాహు ఆస్తి పన్ను రూ.2,80,000ను కమిషనర్ రమేష్, ఆర్ఐ అమరేశ్వరరావుకు అందించారు. సకాలంలో పన్ను చెల్లించి, మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ కోరారు.

వైఎస్ఆర్ బీమా సాయం అందజేత

సంతబొమ్మాళి : ఆర్‌హెచ్.పురానికి చెందిన చిరుగువలస ఈశ్వరమ్మ ఇటీవల మృతి చెందింది. ఆమె కుటుంబానికి వైఎస్ఆర్ బీమా సహాయం కింద రూ.10వేలను సర్పంచ్ ఎన్ని మన్మథరావు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ అధికారి హెచ్.శశిభూషణరావు, పంచాయతీ కార్యదర్శి కె.రాజేంద్రప్రసాద్, వెల్ఫేర్ అసిస్టెంట్ వర్జిన నర్సయ్య, వైస్ సర్పంచ్ టంకాల సుజాత, టంకాల చిరంజీవి, భారతి పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న మన్మథరావు

8వ రోజుకు ఉద్యోగుల నిరసన



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న రెవెన్యూ ఉద్యోగులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్
అమరావతి జెఎసి పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్త ఆందోళన బాగంగా చేపడుతున్న నిరసన కార్యక్రమాలు 8వ రోజుకు చేరాయి. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, విశ్రాంత, కాంట్రాక్టు మరియు ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధనకు చేస్తున్న నిరసన కార్యక్రమాల్లో భాగంగా కలెక్టరేట్ ఎదుట రెవెన్యూ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి బుధవారం నిరసన తెలిపారు. ఉద్యోగుల న్యాయసమ్మతమైన ఆర్థిక ప్రయోజనాలను ప్రభుత్వం దెబ్బతీస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగులపై అనుసరిస్తున్న వైఖరిని తప్పుపట్టారు. కార్యక్రమంలో రెవెన్యూ సర్వీసుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు, కలెక్టరేట్ యూనిట్ అధ్యక్షులు డి.సోనికిరణ్, కార్యదర్శి కె.రాజారెడ్డి, జిల్లా కార్యదర్శి బి.వి.వి.ఎన్ రాజు, శ్రీకాకుళం డివిజన్ కార్యదర్శి డి.ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో నిరసన

వజ్రపుకొత్తూరు: ఎపి అమరావతి జెఎసి పిలుపుమేరకు స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద రెవెన్యూ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలతో బుధవారం నిరసన తెలిపారు. పిఆర్‌సి, డిఎ బకాయిలు చెల్లించాలని, లోన్లు, లీవ్ ఎన్ క్యాస్‌మెంట్, ఒపిఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డిటి వాయిలపల్లి గిరిరాజ్, ఆర్ఐ పవిత్ర, కిరణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

జి సిగడాం: ఉద్యోగుల డిమాండ్లపై ప్రభుత్వం లిఖిత పూర్వక హామీల్లో ఎక్కడా స్పష్టత లేదని డిటి ఎన్.నిర్మల అన్నారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. కార్యక్రమంలో ఆర్ఐ రామచంద్ర, విఆర్‌ఒలు పాల్గొన్నారు.

సుద్దముక్కపై బుల్లి ఆస్కార్



బుల్లి ఆస్కార్‌తో రమేష్

ప్రజాశక్తి - పలాస
పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ గాంధీనగర్ 21వ వార్డుకు చెందిన ప్రముఖ సూక్ష్మ కళాకారుడు కొత్తపల్లి రమేష్ ఆచారి రూపొందించిన బుల్లి ఆస్కార్ అబ్బురపరిచింది. త్రిపుల్ ఆర్ సినిమాలోని నాటు నాటు పాటకు ఆస్కార్ రావడంపై సుద్ద ముక్కపై ఆస్కార్‌ను తయారు చేసి, ఆశ్చర్యపరిచాడు. ఎత్తు 2సెంటీమీటర్లు, వెడల్పు అర సెంటీమీటరు ఉన్న దీన్ని తయారు చేసేందుకు మూడు గంటల సమయం పట్టిందని రమేష్ తెలిపాడు. ఈ సందర్భంగా రమేష్‌ను ఎన్‌టిఆర్ అభిమానులు, సినీ అభిమానులు అభినందించారు.

ఎన్‌టిఆర్ అభిమానుల సంబరాలు

రణస్థలం రూరల్: నాటు నాటు పాటకు ఆస్కార్ రావడంపై మండలంలోని కోష్ట రామాలయం వద్ద ఎన్‌టిఆర్ అభిమానులు పిసిని హరికృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్స్, పండ్లు పంపిణి చేశారు. కార్యక్రమంలో ఎన్‌టిఆర్ అభిమానులు పిసిని లక్ష్మణరావు, చిన్నారావు, పూసర్ల భాస్కరరావు, పిసిని రామకృష్ణ, గోవిందరావు, రమణ, చించినాడ ఈశ్వరరావు, జనతా గ్యారేజీ టీం సభ్యులు పాల్గొన్నారు.



కేకు పంచుతున్న ఎన్‌టిఆర్ అభిమానులు



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

'ఉషోదయ' అధ్యక్షునిగా చంద్రశేఖర్

కవిటి: ఉషోదయ యువజన సంఘం అధ్యక్షునిగా పాండవ చంద్రశేఖర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘం గౌరవ అధ్యక్షుడు బెందాళం చిట్టిబాబు సమక్షంలో బుధవారం ఆ యువజన సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక, ప్రమాణ స్వీకారం నిర్వహించారు. యువజన సంఘం నూతన అధ్యక్షునిగా పాండవ చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడిగా బెందాళం హరి, కార్యదర్శిగా పులకల వెంకటరావు, సహ కార్యదర్శిగా తెప్పల మోహనరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా జన్ని లోకనాథం, కోశాధికారిగా మొర్రి ఆదినారాయణ ఎన్నికయ్యారు. వీరితో పాటు మరో 20మందిని కార్యవర్గ సభ్యులుగా, ప్రత్యేక ఆహ్వానితులుగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గ సభ్యులకు సర్పంచ్ పూడి లక్ష్మణరావు, స్థానిక నాయకులు అభినందనలు తెలియజేశారు.

18న ద్విచక్ర వాహనాల వేలం

రణస్థలం రూరల్: ఎస్ఇబి కార్యాలయంలో ఈ నెల 18న వివిధ కేసుల్లో పట్టుబడిన ద్విచక్రవాహనాలను వేలం వేయనున్నట్లు ఎస్ఇబి ఇన్‌స్పెక్టర్ బిహెచ్ కిరణేశ్వరి ఒక ప్రకటనలో బుధవారం తెలిపారు. ఆసక్తిగల వారు ఉదయం 9గంటలకు ముందస్తుగా రూ.వెయ్యి దరావత్తు చెల్లించి, వేలంలో పాల్గొనాలని కోరారు.



దీక్షలో కూర్చొన్న డ్రైవర్లు

ఒడిశా డ్రైవర్ల దీక్ష

పర్లాకిమిడి: యాక్సిడెంట్లు, లేక ఇతర ఘటనల్లో డ్రైవర్లను కొట్టడం, హింసించడం, లేక ప్రాణ హానికి పూనుకొనే సమయంలో డ్రైవర్లకు ప్రభుత్వం రక్షణ కల్పించాలని, ప్రతి వంద కిలోమీటర్లకు ఒక చోట పార్కింగ్, బాత్ రూములు, టాయిలెట్లు ఏర్పాటు చేయాలని, తదితర సమస్యలపై ఒడిశా డ్రైవర్లు బుధవారం దీక్ష చేపట్టారు. గజపతి జిల్లా శాఖ పర్లాకిమిడి కొత్త బస్టాండ్‌లో చేపట్టిన దీక్షలో ఒడిశా డ్రైవర్ల మహా సంఘం నాయకులు గోపీనాథ్ పాడి, కుసో బిస్వాల్, మీసాల సంతోష్‌కుమార్, ఎం.మణికుమార్ మాట్లాడుతూ 55ఏళ్ల తరవాత డ్రైవర్లకు పెన్షన్ సదుపాయం కల్పించాలని, ప్రమాదవశాత్తు మరణించిన డ్రైవర్లకు రూ.20 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, అనారోగ్యం పాలైన డ్రైవర్ల కుటుంబసభ్యులకు రూ.5 లక్షలు, మెడికల్ క్లైమ్ కల్పించాలి అని డిమాండ్ చేశారు. డ్రైవర్ల పిల్లలకు ఉచిత విద్య, అన్ని రకాల లైసెన్సులు, సర్టిఫికేట్లు ఉన్నప్పటికీ పోలీసులు, అర్‌టిఒ సిబ్బంది ఇబ్బందులకు గురి చేస్తున్నారని, వీటిని మానుకోవాలని కోరారు. దీక్షలో అశ్విని సునిల్‌కుమార్, కె.మిన్నారావు, శివ ప్రసాద్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ చట్టానికి తూట్లు

పలాస: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ చట్టానికి తూట్లు పొడుస్తూ నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తున్నారని అఖిల భారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం, అఖిల భారత కిసాన్ మహాసభ, ఆలిండియా ట్రేడ్ యూనియన్ నాయకులు తామాడ సన్యాసిరావు, మద్దిల రామారావు, దున్న శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని బొడ్డపాడులో ఉపాధి హామీ పనులను పరిశీలించారు. కుత్తుం దుష్యంత్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ 200 రోజులకు పనిదినాల కేటాయించలేదని, కనీస వేతనం రూ.600లకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పట్టణ, గ్రామీణ ఉపాధి హామీ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని కోరారు. అనంతరం పంచాయతీ కార్యదర్శికి వివిధ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.



జలుమూరు : తమకు కేటాయించిన రూములను నోటీసు బోర్డులో చూస్తున్న విద్యార్థులు



జి.సిగడాం : తండ్రితో కలిసి పరీక్షా కేంద్రానికి వెళ్తున్న విద్యార్థి

ఇంటర్ పరీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి - పోలాకి

ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రశాంత వాతావరణంలో బుధవారం ప్రారంభమయ్యాయి. పోలాకి మండలంలోని ప్రియాగ్రహారం, పోలాకి జూనియర్ కళాశాలలోని పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన తెలుగు పరీక్షకు 333 మందికి 321 మంది హాజరయ్యారు. ఒకేషనల్‌కు 72 మందికి 64 మంది పరీక్ష రాశారు. ఫ్లైయింగ్ స్క్వాడ్ వి.నారాయణరావు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

కవిటి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి రోజు పరీక్షలకు 203 మందికి 18 మంది హాజరు కాలేదు. ఎస్‌విజె విద్యా సంస్థలో 217 మందికి ఐదుగురు పరీక్షకు రాలేదు.

జలుమూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 290 మందికి ఐదుగురు హాజరు కాలేదని చీఫ్ సూపరింటెండెంట్ డి.వేణుగోపాలరావు, డిపార్టుమెంట్ అధికారి ఇలపండ మాధవరావు తెలిపారు. ఫ్లైయింగ్ స్క్వాడ్‌తో పాటు, తహశీల్దార్ బి.సత్యం పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు.

నందిగాం: డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలో ఇంటర్ పరీక్షలకు 103 మందికి 99 మంది హాజరైనట్లు చీఫ్ సూపర్డెంట్ పి.శ్రీనివాసరావు తెలిపారు ఈ పరీక్షలను కళాశాల ప్రిన్సిపాల్ బి.దమయంతి, డిఒ అజయ్, డివిఇఒ ప్రకాశరావు పర్యవేక్షించారు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురంలో ఏర్పాటు చేసిన నాలుగు పరీక్షా కేంద్రాల్లో 1077 మంది పరీక్ష రాశారు. 44 మంది గైర్హాజరయ్యారు. స్వర్ణభారతిలో హరిప్రసాద్, ఆదిత్య కాలేజిలో బాబులు సాహు, జీరు శేఖర్, మహిళా కాలేజీలో రజనీకుమారి, బాలుర కాలే.జీలో శంకర ప్రసాద్ అధ్వర్యంలో ప్రశాంతంగా పరీక్షకు నిర్వహించారు.

జి సిగడాం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 219 మంది పరీక్షలు రాశారు. ఇద్దరు పరీక్షకు రాలేదు. జాడ గ్రామానికి చెందిన భార్గవ్ అనే విద్యార్థి తన తండ్రితో పరీక్ష సమయం ముగిసిపోవడంతో పరిగెడుతూ పరీక్షకు హాజరయ్యాడు.

ఆమదాలవలస: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 367 మంది పరీక్ష రాశారు. ఐదుగురు విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారని చీఫ్ సూపర్డెంట్ ఎస్‌విఎల్ నారాయణ తెలిపారు. టిఎస్ఆర్ ప్రైవేటు జూనియర్ కళాశాల 126 మంది పరీక్ష రాయగా, పది మంది రాలేదు. తొగరాం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 94 మంది పరీక్ష రాశారు. ముగ్గురు గైర్హాజరయ్యారు.

కోటబొమ్మాళి: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 183 మందికి ఐదుగురు పరీక్ష రాయలేదు. వంశధార జూనియర్ కళాశాలలో 230 మందికి ముగ్గురు పరీక్షకు హాజరు కాలేదు. పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, వైద్య సదుపాయం కల్పించారు. జిల్లా వృత్తి విద్యాశాఖ అధికారి కె.ప్రకాష్‌రావు పరీక్షా కేంద్రాలను సందర్శించారు. **పొందూరు:** మండలం పరిధిలో మూడు పరీక్షా కేంద్రాల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని మూడు పరీక్షా కేంద్రాలలో 741 మందికి 710 మంది పరీక్ష రాశారు. 31 మంది గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ రామ్‌మనోహర్ తెలిపారు.

పలాస: పలాస జూనియర్ కళాశాలతో పాటు ప్రజ్ఞ, ప్రతిభ, విద్యా వాహిని, గురుకుల, అక్షర, సూర్య తేజ కళాశాలలో ఇంటర్ పబ్లిక్ పరీక్షలు జరిగాయి. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు పాటు వైద్య సేవలు అందుబాటులో ఉంచారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా మౌలిక సదుపాయాలు కల్పించారు.



పలాస : పరీక్షకు హాజరైన విద్యార్థులు

ఉత్తరాంధ్ర వెనుకబాటుపై ఉద్యమం

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

ఉత్తరాంధ్ర జిల్లాల్లోని ప్రజలు అన్ని రంగాల్లో అట్టడుగు స్థాయిలో ఉన్నారని ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థి దుప్పల రవీంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఉత్తరాంధ్ర వెనుకబాటుతనాన్ని మేధావుల దృష్టికి తీసుకెళ్లాలన్న భావనతోనే తాను ఎన్నికల బరిలో పోటీ చేశానని చెప్పారు. నగరంలోని హోటల్ గ్రాండ్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కులం, ధనం, అధికారం ఈ ఎన్నికల్లో కీలక పాత్ర పోషించడం ప్రజాస్వామ్యానికి ప్రమాదసూచిక అన్నారు. ఉత్తరాంధ్ర గురించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను నిలదీసే స్థితిలో ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు ఉన్నారని విమర్శించారు. ఉత్తరాంధ్ర వ్యవసాయ రంగం శరవేగంగా దిగజారిపోతుందని, సాగు భూములు రియల్ ఎస్టేట్లుగా మారిపోతున్నాయన్నారు. త్వరలో ఉత్తరాంధ్ర సమస్యలు - పరిష్కార మార్గాలు అనే అంశంపై చర్చావేదికలు నిర్వహిస్తామన్నారు. నల్లి ధర్మారావు మాట్లాడుతూ సిక్కోలు జల సాధన సంరక్షణ సమితిని ఉత్తరాంధ్ర సమితిగా విస్తరిస్తున్నట్టు చెప్పారు. దీనికి కన్వీనర్‌గా రవీంద్రబాబు ఉంటారని, రిటైర్డ్ ఇరిగేషన్ ఇంజనీర్లు, ప్రొఫెసర్లు, రైతుసంఘాల ప్రతినిధులు, ఆసక్తి గల మేధావులతో పూర్తి కమిటీని త్వరలో ప్రకటిస్తామన్నారు.



మాట్లాడుతున్న దుప్పల రవీంద్ర

రాయికోలలో తేజేశ్వరరావు పర్యటన

మెళియాపుట్టి: మండలంలోని పరుశు రాంపురం, నందవ, రాయికోల, తోవూరు, నందవకొత్తూరు, తదితర గ్రామాల్లో బుధవారం విద్యావేత్త సిరిపురం తేజేశ్వరరావు పర్యటించారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో ఉన్న విద్యార్థులు, నిరుద్యోగులతో ముచ్చటించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉద్యోగ అవకాశాల కోసం ఎటువంటి చదువులు చదివితే బాగుంటుందో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సరాలి సర్పంచ్ పడాల షణ్ముఖరావు, లింగాల వెంకటకృష్ణారావు, ఎన్.నాగేశ్వరరావు, పి.రాజారావు, సిరిపురం మిత్ర బృందం సభ్యులు పాల్గొన్నారు.

నాయకత్వ అభివృద్ధిపై శిక్షణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

నాయకత్వ లక్షణాలు పెంచుకునేందుకు మూడు రోజులపాటు నిర్వహిస్తున్న శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సహకార అధికారి ఎస్.సుబ్బారావు పిలుపునిచ్చారు. నేషన్ సెంటర్ ఫర్ కో ఆపరేటివ్ ఎడ్యుకేషన్, న్యూఢిల్లీ ఆధ్వర్యాన రాష్ట్ర సహకార యూనియన్, రాజమండ్రికి చెందిన రామదాసు సహకార శిక్షణా కేంద్రం, జిల్లాలోని లేబర్స్ కాంట్రాక్ట్ కోఆపరేటివ్ సొసైటీస్ చైర్మన్లు, పాలకవర్గ సభ్యులకు నాయకత్వ అభివృద్ధిపై మూడు రోజుల శిక్షణా కార్యక్రమాలను ఎన్‌జిఒ హోం బుధవారం ప్రారంభించారు. సొసైటీ పాలకవర్గాలకు విద్య, నైపుణ్యం పెంపొందించడమే లక్ష్యమన్నారు. సహకార సంఘాల నిర్వహణ, సహకార విలువలు, సూత్రాలు, పాలకవర్గ అధికారాలు, విధులు తదితర అంశాలపై పూర్తిస్థాయిలో శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. ఈ శిక్షణను సద్వినియోగం చేసుకుని తద్వారా సహకార సంఘాలు ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు.

రాష్ట్ర సహకార యూనియన్ ప్రిన్సిపాల్ జి.శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో రామదాసు సహకార శిక్షణా కేంద్రం ప్రిన్సిపాల్ వి.శ్రీనివాస్, డివిజినల్ సహకార అధికారి కె.దామోదర్, సబ్ డివిజనల్ సహకార అధికారి ఎస్.భూషణరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుబ్బారావు